క్లుప్తంగా

కుష్టు వ్యాధి సర్వేకు సహకరించండి



వైద్య పరీక్షలకు చేస్తున్న సిబ్బంది

దెందులూరు: ప్రతి కుటుంబం ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బందికి సహకరించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో గ్రామ శివారు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి సర్వే నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు సర్వేకి వెళ్లినప్పుడు వారి వ్యక్తిగత గౌరవం ఇబ్బంది లేకుండా వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. పోతునూరు, సీతంపేట, కొత్తూరులో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీహెచ్ఈ ఓ.హరి పర్యవేక్షించారు.

కైకరం విద్యార్థిని కుసుమలతకు ప్రశంసాపత్రం



కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కుసుమలత

ఉంగుటూరు: రాష్ట్ర, జాతీయస్థాయిలో పలువురు మన్నలను అందుకున్న కైకరం హైస్కూలు విద్యార్థిని నెరుసు కుసుమలతకు జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి ప్రశంసాపత్రం, మెమెంటోను అందించి అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా కుసుమలత ప్రశంసాపత్రం అందుకున్నట్టు హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. తాడిచెట్టు సాగు- ఒక నూతన వ్యవసాయ విధానం ప్రాజెక్టుకు కుసుమలత జాతీయస్థాయిలో అవార్డు పొందిన విషయం విదితమే. ఈ సందర్భంగా పలువురు స్థానికులు సోమవారం కుసుమలతను అభినందించారు.

రోడ్డు భద్రతపై శ్రద్ధ వహించండి



నవోదయ విద్యాలయంలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ

పెదవేగి : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని రవాణా శాఖ ఆర్టీఓ మదాని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ఫిబ్రవరి 15 వరకు నిర్వహించేందుకు నిర్ణయించారని తెలిపారు. ఈ సంవత్సరం రహదారి భద్రత ప్రచారం ×శ్రద్ధ వహించండి × అనే నినాదంతో ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం నవోదయ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్టీఓ మదాని అధ్యక్షత వహించగా, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో పాదయాత్ర

ఉంగుటూరు: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్రకోశాధికారి పెన్మత్స రామచంద్రరాజు ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నారాయణపురంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన మంత్రి నూకల మధుకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణపురంలో పాదయాత్ర, పెదనింద్రకొలను వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, మహిళా మోర్చారాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, పార్లమెంటు కన్వీనర్ కృష్ణ ప్రసాదు, జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వంజరపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి లేక పొట్ట చేత పట్టుకుని వలసలు వెళుతున్న గ్రామీణ పేదలకు వ్యవసాయ కార్మికులకు తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ ను కోరారు. సోమవారం బీకేఎంయూనాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి ఉపాధి హామీ పనులు గ్రామీణ పేదలకు కల్పించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 పని దినాలు కల్పించి రోజు కూలీ 700 రూపాయలు ఇవ్వాలని కోరారు. మెటీరియల్ కాంపొనెంట్‌ను ప్రభుత్వమే భరించి మొత్తం ఉపాధి హామీ నిధులను కూలీలకే ఖర్చు చేయాలని ఆయన కోరారు. కలెక్టర్ ని కలిసిన వారిలో బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోలిమే బాల యేసు తదితరులు ఉన్నారు.

ఎరువు.. ధరల దరువు

- బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెంపు
- యూరియా బ్లాక్‌లో కొంటున్న రైతులు
- రబీలో పెరుగుతున్న పెట్టుబడి



నిడమర్రు మండలంలో వరి పొలంలో ఎరువులు చల్లేందుకు ఏర్పాట్లు చేస్తున్న రైతులు



ఎంఆర్పీ రూ.266.50 యూరియా బస్తా

నిడమర్రు: సార్వాలో అధిక వర్షాలతో తగ్గిన దిగుబడులతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల ధరలు భారీగా పెంచడంతో వారిలో ఆందోళన నెలకొంది. ఎరువుల నుంచి డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదల రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 48,883 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. మరో 30 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్, మామిడి, కూరగాయలు వంటి ఇతర పంటలు సాగవుతున్నాయి. వరిసాగులో రైతులు ఎకరాకు ఐదు నుంచి ఆరు బస్తాల వరకు ఎరువులు ఉపయోగిస్తారు. ఇందులో మూడు బస్తాలు కాంప్లెక్స్ ఎరువు ఉంటుంది. దీంతో నియోజకవర్గంలో దాదాపు 15 వేల బస్తాల వరకూ కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రైతులు ఎక్కువగా 28-28-0, 10-26-26, వంటి కాంప్లెక్స్ ఎరువులను వినియోగిస్తారు.

బ్లాక్‌లో యూరియా

అధికారులు రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా యూరియా అందిస్తున్నట్టు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితిలేదని రైతులు వాపోతున్నారు. యూరియా బస్తా ఎంఆర్పీ రూ.266 ఉంటే హోల్ సెల్ మార్కెట్‌లో రూ.290తోపాటు ట్రాన్స్‌పోర్టు కిరాయి రూ.21కలుపుకుంటున్నారు. దీంతో 266కు అదనంగా రూ.320 వరకూ రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో యూరియాపై రైతుకు బస్తాకు రూ.50 అదనపుభారం పడుతోందని చెబుతున్నా రు. ధరలు నియంత్రణలో చంద్రబాబు సర్కారు మరోసారి తమను మోసంచేసిందని విమర్శిస్తున్నారు.

పెరిగిన రసాయనక ఎరువుల వినియోగం

వరి పంటకే కాకుండా మెట్టలో మిర్చి, కూరగాయలు తదితర పంటలకు కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ వినియోగిస్తున్నారు. రబీలో వర్షాధారం కింద సాగు చేస్తున్న శనగ, జొన్న. నీటి సదుపాయం కింద సాగు చేస్తున్న వరి వేరుశనగ, మినుము పంటలతో పాటు కూరగాయల సాగు వల్ల రసాయన ఎరువుల వినియోగం పెరిింది. రైతులు ఎక్కువగా ఉపయోగించే 28-28-0, 14-35-14, 20-20-0-13, 16-20-0-13, 10-26-26 ఎరువుల ధరలే పెరగడం వల్ల ఒక్కో రైతుపై రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకు ఆర్థిక భారం పండుతుందని రైతులు లెక్కలు కడుతున్నారు.

ఎరువు	పాత ధర రూ.	కొత్త ధర రూ.
28-28-0	1,680	1800
14-35-14	1,680	1,800
20-20-0-13	1,150	1,300
10-26-26	1,370	1,470
16-20-0-13	1,150	1,250

జగన్ హయాంలోనే ఊరట

2014-15 నుంచి 2018-19 వరకు టీడీపీ అధికారంలో ఉంది. అప్పట్లో కూడా బీజేపీ ప్రభుత్వానికి టీడీపీ కొమ్ము కాసింది. ఆ సమయంలో ఏకంగా నాలుగు సార్లు రసాయన ఎరువులు ధరలు పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2019-20 నుంచి 2023-24 వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంది. ఈ సమయంలో రసాయన ఎరువుల ధరలు ఒక్కసారి కూడా పెరిగిన దాఖలాలు లేవు. ఎరువుల ధరలు నిలకడగా ఉంటంతో రైతులకు ఊరట లభించింది. ప్రస్తుతం ఎరువుల ధరలు పెంచడంలో టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రానికి పూర్తి మద్దతు ఇచ్చాయనే ప్రచారం సాగుతోంది.



14-35-14 ఎరువు బ్యాగ్‌పై ఉన్న పెరిగిన ధర ఎంఆర్పీ రూ.1,800

రైతులకు వెన్నుపోటు



గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడూ బీజేపీ సర్కారు ఎరువుల ధరలు పెంచినా ఏనాడు వ్యతిరేకించిన దాఖలాలు లేవు. నేడు ఎరువుల ధరలు పెరిగి రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడంలేదు. ఎన్నికల్లో మాత్రం రైతు పక్షపాతిని అంటూ కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే ఎరువుల ధరలు పెంచి రైతుల నడ్డి విసరడం దారుణం.

– అలుమోలు గంగారాం, రైతు, బువ్వనపల్లి

ప్రభుత్వమే భరించాలి



సార్వాలో వరుస తుఫానులు, అధిక వర్షాల కారణంగా చేతికందుతున్న పంట దిగుబడి గణనీయం పడిపోయింది. దీంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి కౌలు రైతులది. ఇప్పుడు అమాంతం ఎరువుల ధరలు పెంచడం వల్ల రబీలో పెట్టుబడి మరింత పెరుగుతుంది. పెరిగిన ధరను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

– మచ్చకర్ల సాయిబాబా, కౌలు రైతు, బువ్వనపల్లి

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

భీమడోలు: జాతీయ రహదారి సూరప్పగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడైన బొడ్డు రమేష్ ఏలూరు ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. ఈనెల 26వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన బొడ్డు రమేష్ తన మోటార్‌సైకిల్‌పై భీమడోలు వైపుగా వెళ్తున్నాడు. ఈ తరుణంలో సూరప్పగూడెం ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సరికి ఓ వ్యక్తి అతివేగంగా రాంగ్ రూట్‌లో మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వచ్చి బొడ్డు రమేష్ నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. అతని సోదరుడు బొడ్డు రవి ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం భీమడోలులో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

పెద్దిరాజుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న పెద్దిరాజు

ఉంగుటూరు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఉంగుటూరు-1 పాఠశాల హెచ్‌ఎం శిరిమామిళ్ల పెద్దిరాజు కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ఏలూరులో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అందుకున్నారు. పెద్దిరాజు పాఠశాలల్లో దాతల సాయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేశారు. విద్యాబోధనలో సాంకేతికత జోడించి సొంత ఖర్చుతో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ రూపొందించి కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. 2024లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పెద్దిరాజుకు దక్కింది. ఆయనతోపాటు తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటు సాయిరమేష్, ఉప్పాకపాడు వీఆర్వో ఉత్తమ అవార్డును కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు.

ఆకట్టుకున్న లేగ దూడల అందాల పోటీ



ఎంఎంపురంలో పాడి రైతులకు మందులను అందిస్తున్న అధికారులు



ఎంఎంలో అందాల పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన లేగదూడ

భీమడోలు: పాడి రైతులు పశువులకు సంక్రమించే గర్భకోశ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని భీమడోలు సబ్ డివిజనల్ సహాయ సంచాలకులు ఇక్కుర్తి సాయి రమేష్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో సోమవారం పశుగణాభివృద్ధి సంస్థ (పెంటపాడు) వారి సహాయ సహకారాలతో లేగదూడల అందాల ప్రదర్శన, గర్భకోశ వ్యాధుల చికిత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఏడీ సాయిరమేష్, జిల్లా సీఈవో డాక్టర్ జి.జేసురత్నం, సర్పంచ్ దాయం సుజాత ప్రారంభించారు. పశువైద్యులు ఎం.హరికృష్ణ తదితర బృందం పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, తద్వారా వాటిని సంరక్షించుకోవచ్చునన్నారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నాలుగు నెలలలోపు గల లేగ దూడల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పోటీలో 54 దూడలు పాల్గొనగా వాటి శరీర సౌష్టవం, జాతి లక్షణాల ఆధారంగా బహుమతులను అందించారు. వాటిలో పూళ్ల, ఎంఎంపురానికి చెందిన రైతులు గురజాల ఆంజనేయులు, కె.సిల్వరాజు, రేగడపల్లి మల్లేశ్వరరావుకు చెందిన లేగదూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించాయి. అనంతరం మహిళా పాడి రైతులకు మందులను అందించారు. ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మనాయుడు, పెద్దలు వడ్డి సత్తులు, సరేష్, గోపాల్, దాయం ప్రసాద్, గోపాలమిత్రలు, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

రావులపర్రులో డ్రెయిన్ల దుస్థితిపై ఫిర్యాదు

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో అధికారులు పలు ఫిర్యాదులు అందాయి. రావులపర్రులో డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడంతో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాది వెంకటరమణ, గ్రామ ప్రజలు సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీ అందజేశారు. రెండు నెలలుగా తీవ్రమైన జ్వరాలతో గ్రామ ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. పంచాయతీ వారికి తెలిసినా పట్టించుకోవడవలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రెయినేజీలో మురుగు నీరు పారడంలేదని తెలిపారు. తహసీల్దార్ పూర్ణ చంద్రప్రసాదుకు, ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఊరచెరువు పూడిక తీయాలని ఎ.గోకవరం ప్రజలు అర్జీలో కోరారు. తమ చేనుకు దక్షిణం వైపు దౌర్జన్యంగా కంచె వేశారని బొబ్బిలి రంగరావు ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు పెట్టిన బడ్డీ కొట్టు తొలగించాలని వెల్లమిల్లికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ప్రజాఫిర్యాదుల విభాగానికి సంబంధించిన అన్ని శాఖల అధికార్లు, బాధ్యులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం

దెందులూరు: ఎంపీటీసీలకు గౌరవ వేతనం కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని వైఎస్సార్ సీపీ నేత చల్లచింతలపూడి ఎంపీటీసీ సింహాద్రి శ్రీమన్నారాయణ ప్రశ్నించారు. సోమవారం చల్లచింతలపూడిలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక నెల కూడా గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు జీతాలు, రాయితీలు ప్రభుత్వ నుంచి తీసుకుంటున్నారని, మండల స్థాయికి వచ్చేసరికి వివక్ష ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. బహిరంగ సభలో, ప్రచార సాధనాల్లో నాయకులు చెప్పేదానికి ఆచరణలో చేసేదానికి అసలు సంబంధమే లేదన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యమవుతున్నా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని 7 నెలలుగా మంజూరు గాని ఎంపీటీసీల గౌరవ వేతనాన్ని విడుదల చేయాలని ఆయన కోరారు.

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి



భీమడోలులో అవగాహన కల్పిస్తున్న జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్

భీమడోలు: ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ అన్నారు. భీమడోలు మానస ఇంగ్లీషు ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్రైవర్లకు ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంవీఐలు శేఖర్, ప్రసాద్, హజ్జీర్, మధు, నరేంద్ర, ప్రజ్ఞ, కల్యాణి పాల్గొని రహదారి భద్రతపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ విద్యార్థులకు తల్లిదండ్రులు మోటార్ బైక్‌లు ఇవ్వరాదని, 18 ఏళ్ల నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్సులను అందిస్తామని తెలిపారు.వాహనదారులు హెల్మెట్ లేకుండా రోడ్డుపై ప్రయాణించవద్దన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ స్వామి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లి ఉత్సవాలకు విద్యుద్దీపాలంకరణ







అమ్మవారి ఉత్సవాలకు విద్యుద్దీపాలంకరణలో భాగంగా సిద్ధమైన స్వాగత ద్వారాలు

దెందులూరు: నమ్మి కొలిచిన భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న గాలాయిగూడెం అచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల ఎల్ఈడీ విద్యుత్ బల్బులతో అచ్చమ్మ పేరంటలమ్మ, శ్రీమహావిష్ణువు తదితర దేవతామూర్తుల ఆకారంలో రూపొందించిన స్వాగత ద్వారాలను సిద్ధం చేశారు. ఈ స్వాగత ద్వారాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

హేలాపురి బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



అన్నేవారిగూడెంలో విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్, టీచర్లు

భీమడోలు: ఏలూరులో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించిన హేలాపురి బాలోత్సవంలో అన్నేవారిగూడెం యూపీ పాఠశాలల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటారు. పాఠశాలలోని 45 మంది బాలబాలికలు కోలాటం, మట్టితో బొమ్మల తయారీ, మెమొరీ పరీక్ష, చిత్రలేఖనం, ఇంగ్లీషు పద్యాల పోటీలు, అంతర్జాలంలో అన్వేషణ తదితర అంశాలపై తమ ప్రతిభను చాటుకుని ఔరా అనిపించారు. హెచ్‌ఎం షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం ఆ చిన్నారులకు తర్ఫీదును అందించి వారిని ప్రోత్సహించారు. బాలోత్సవం పోటీల్లో వారంతా చక్కని ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జిల్లాస్థాయిలో గుర్రం జాషువా పద్యాల ఆలాపన పోటీల్లో ప్రథమ స్థానాన్ని అన్నేం నాగ సుబ్రహ్మణ్యం సాధించాడు. వారంతా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అన్నేవారిగూడెం పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారందరినీ హెచ్‌ఎం షేక్ మస్తాన్, ఉపాధ్యాయులు, సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పొల్నాటి శ్రీనివాసరావు అభినందించారు. గుండుగొలనులోని శ్రీవిద్యాలయ పాఠశాలకు చెందిన బాలబాలికలు హేలాపురి బాలోత్సవం పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చూపారని ప్రిన్సిపల్ గేదెల సురేష్‌కుమార్ తెలిపారు. 60 విభాగాల్లో విద్యార్థులు పాల్గొని 52 బహుమతులను సొంతం చేసుకున్నారు.

విద్యా ప్రణాళిక తయారీపై హెచ్‌ఎంలకు శిక్షణ



భీమడోలులో హెచ్‌ఎంలకు విద్యాప్రణాళికలపై శిక్షణనిస్తున్న పాశం పాండురంగారావు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు విద్యా ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోధ్యాయులకు 2025-26 విద్యాసంవత్సరానికి పాఠశాల, ఆవాస ప్రాంత విద్యా ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండుగొలను హెచ్‌ఎంలు సత్యనారాయణ, పాశం పాండురంగారావు విద్యా ప్రణాళికలపై మెలకువలు, పాటించాల్సిన నిబంధనలపై వివరించారు. హెచ్‌ఎంల అనుమానాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా ప్రణాళికలను చిత్తశుద్ధితో, తప్పుల్లేని నివేదికలను సమర్పించాలన్నారు. ఈ ప్రణాళికల ద్వారా పాఠశాలలకు బడ్జెట్ ద్వారా నిధులు సమకూరుతాయని, దీనితో పాఠశాల్లోని విద్యార్థులకు కనీస వసతులు అందుతాయన్నారు. ఉపాధ్యాయులందించే నివేదికలో పూర్తిస్థాయి సమగ్ర సమాచారం ఉండాలన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు షేక్ మస్తాన్, జి.బాలభాస్కర్, బాలిన సత్యనారాయణ, సీఆర్ ఎంటీలు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగిన ఉరుసు ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ దర్గా ఉరుసు ఉత్సవాలు రెండోరోజు కూడా కొనసాగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఉత్సవాల్లో స్థానికులు దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. దర్గా ముజావర్లు షేక్ హుస్సేన్, షేక్ షాబీర్ హుస్సేన్, షేక్ షబ్బీర్ హుస్సేన్ తదితరులు దువా కార్యక్రమాలు నిర్వహించారు.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

ఏలూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణంపై చూపుతున్న ఆసక్తి కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న దళితులపై చూపడం లేదని ఎస్సీ ఫిషర్మెన్స్ సొసైటీ చైర్మన్ చాగంటి సంజీవ్ అన్నారు. సోమవారం ఏలూరు జాబిల్లి అతిథి గృహంలో ఎస్సీ ఫిషర్మెన్స్ సొసైటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరుపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు గ్రామాల్లో నివసించే ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. కొల్లేరుపై లంక గ్రామాల ఎస్సీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. కొల్లేరును అభయారణ్య పరిధిలో తీసుకురావడంతో లంకగ్రామాల ప్రజలు కష్టాలు మొదలయ్యాయన్నారు. ప్రధాన కార్యదర్శి పల్లెం ప్రసాద్ మాట్లాడుతూ కొల్లేరు ప్రజలను ఆదుకుంటామని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలయ్యాయని గుర్తు చేశారు. కొల్లేరు ప్రక్షాళన తర్వాత ఉపాధి లేక ప్రజలు వలస వెళ్లిపోయారని బొడ్డు నోయల్ అన్నారు.